సాక్షి రంగారెడ్డి

శనివారం । 30 । సెప్టెంబర్ । 2023



అభివృద్ధే ధ్యేయం

ఆర్యవైశ్యుల అభివృద్ధే ధ్యేయమని సంఘం మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి గందె సురేశ్ పేర్కొన్నారు.

8లో▸



రైతుల సంక్షేమానికి కృషి

అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు.

8లో▸



సర్వే అడ్డగింత

నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల సర్వేను కౌలు రైతులు అడ్డుకున్నారు. అధికారులపై వారు మండిపడ్డారు.

8లో▸

న్యూస్‌రీల్

బ్యాంకు ఉద్యోగాలకు ఉచిత శిక్షణ

ఇబ్రహీంపట్నం రూరల్: బ్యాంకు ఉద్యోగాల కోసం సన్నద్ధం అవుతున్న జిల్లాలోని మైనార్టీలకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా మైనార్టీ సంక్షేమ సంఘం అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి గలవారు అక్టోబర్ 7వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాల కోసం 040 23236112 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'పట్నం' ఈఈగా శ్రీనివాస్‌రెడ్డి



ఇబ్రహీంపట్నం రూరల్: పంచాయతీరాజ్ శాఖ ఇబ్రహీంపట్నం డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా శ్రీనివాస్‌రెడ్డి బాధ్యతలు చేపట్టారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త డివిజన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఇబ్రహీంపట్నంలో డీఈగా పని చేస్తున్న శ్రీనివాస్‌రెడ్డికి ఈఈగా పదోన్నతి కల్పించింది. ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన డివిజనల్ కార్యాలయంలో ఈఈగా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

మంత్రి హరీశ్‌రావు పర్యటన రేపు

ఆమనగల్లు: వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావు అక్టోబర్ 1న రానున్నారు. పట్టణంలో నూతనంగా రూ.17.50 కోట్లతో నిర్మించే 50 పడకల ఆస్పత్రి భవన నిర్మాణం, ఆమనగల్లు మున్సిపాలిటీలో టీయూఎఫ్ఐడీసీ నిధులతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేయనున్నారు. ఈ మేరకు మంత్రి పర్యటన కోసం ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల భిక్షాటన



ఆమనగల్లులో భిక్షాటన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఆమనగల్లు: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం నాటికి 19వ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా ఆమనగల్లు పట్టణంలో భిక్షాటన నిర్వహించారు. ప్రభుత్వం స్పందించి అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, అలివేలు, రాజ్యలక్ష్మి, సంధ్య, లక్ష్మమ్మ, శాంతమ్మ, అలివేలు, రజిత, స్వరూప, అంజమ్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

మైసిగండి సన్నిధిలో ఎమ్మెల్సీ కసిరెడ్డి



అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవాలయాన్ని శుక్రవారం ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆయనకు అర్చక సిబ్బంది పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ మేరకు ఆలయంలో అమ్మవారికి ఎమ్మెల్సీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు ఎమ్మెల్సీని శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి బీఆర్ఎస్ పార్టీకి గుడ్‌బై చెప్పి కాంగ్రెస్ తీర్థం పుచ్చుకోనున్నారనే వార్తల నేపథ్యంలో.. శుక్రవారం మైసిగండి మైసమ్మ దేవతను తన ముఖ్య అనుచరులతో కలిసి దర్శించుకోవడం స్థానికంగా చర్చనీయాంశమైంది. కార్యక్రమంలో ఎంపీపీలు కమ్లీ, అనిత, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు అశోక్‌రెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యుడు భాస్కర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్, రాంచంద్రయ్యగౌడ్, మల్లయ్య తదితరులు ఉన్నారు.

ఎడ్యుకేషన్ హబ్

సరస్వతీ నిలయంగా మహేశ్వరం

- అందుబాటులో ఇంటర్, డిగ్రీ, పీజీ, బిజినెస్, లా కాలేజీలు
- కందుకూరులో రేపు మెడికల్ కాలేజీకి శంకుస్థాపన
- రూ.176 కోట్ల అంచనా వ్యయంతో 450 పడకల భవనం
- హాజరు కానున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: పరిశ్రమల స్థాపనలోనే కాదు వృత్తి విద్యా కోర్సుల ఏర్పాటులోనూ మహేశ్వరం ముందంజలో ఉంది. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలు, ఇంటర్మీడియెట్, డిగ్రీ కాలేజీలు అందుబాటులోకి వచ్చాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయం కూడా ఇదే నియోజకవర్గంలో ఏర్పాటైంది. తాజాగా పాలిటెక్నిక్, బిజినెస్, డైట్, లా సహా మెడికల్ వంటి వృత్తివిద్యా కోర్సుల ఏర్పాటుతో సరస్వతీ నిలయంగా మారుతోంది. తాజాగా మెడికల్ కాలేజీ శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్నారు. రూ.176 కోట్ల అంచనా వ్యయంతో కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేట రెవెన్యూ సర్వే నంబర్ 112లో సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో కొత్తగా ఏర్పాటు చేయబోతున్న మెడికల్ కాలేజీ భవనానికి ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. కార్యక్రమానికి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు సహా విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, జిల్లా ప్రజాప్రతినిధులు హాజరు కానుండటంతో అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉన్నత విద్యకు కేంద్ర బిందువుగా..

సాక్షాత్తూ విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న ఈ నియోజకవర్గంలో ఒకప్పుడు కనీసం చదువుకునేందుకు ప్రాథమిక పాఠశాలలు, జూనియర్ కాలేజీలు ఉండేవి కావు. ఉన్నవాటిలోనూ సరైన సదుపాయాలు కనిపించేది కాదు. కొత్త కాలేజీల కోసం విద్యార్థి సంఘాలు తరచూ ఆందోళనలు చేపడుతుండేవి. నియోజకవర్గంలో విద్యా సంస్థలు లేని లోటును పూడ్చాలని మంత్రి భావించారు. నిరుపేద విద్యార్థులకు నాణ్యమైన వృత్తి విద్యను అందించాలని ఆశించారు. ఈ మేరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చారు. అప్పటి వరకు ఒక్క కాలేజీ కూడా లేని నియోజకవర్గంలో కొత్తగా నాలుగు జూనియర్ కాలేజీలను ప్రారంభించారు. ఒక్క డిగ్రీ కాలేజీ కూడా లేని చోట ప్రస్తుతం మూడు కాలేజీ ఉండడం విశేషం. రెండు పాలిటెక్నిక్ కాలేజీలు ప్రారంభించారు. ఇటీవలే డైట్ కాలేజీ, ఒక పాలిటెక్నిక్ కాలేజీ భవనాలకు శంకుస్థాపన చేశారు. న్యాయ విద్యను చేరువ చేయాలనే ఆలోచనతో లా కాలేజీని మంజూరు చేయించారు. అత్యాధునిక లైబ్రరీని ఏర్పాటు చేయించి, అందులో పోటీ పరీక్షలకు కావాల్సిన పుస్తకాలను విద్యార్థులకు అందుబాటులో ఉంచారు. మన ఊరు, మనబడి పథకంలో భాగంగా శిథిలావస్థకు చేరుకున్న అనేక ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిలో తీర్చిదిద్దారు.

విద్యా సంస్థలకు నిధుల వరద

రూ.6.55 కోట్లతో నాలుగు జూనియర్ కళాశాల్లో నూతన తరగతి గదులు, ప్రహరీ సహా ఇతర అభివృద్ధి పనులు చేపట్టారు. వీటిలో మీర్‌పేట జూనియర్ కాలేజీకి రూ.1.33 కోట్లు కేటాయించగా, కందుకూరు జూనియర్ కాలేజీకి రూ.2 కోట్లు, మహేశ్వరం జూనియర్ కాలేజీకి రూ.1.20 కోట్లు, సరూర్‌నగర్ జూనియర్ కళాశాలకు రూ.2 కోట్లు మంజూరు చేయించగా పనులు శరవేగంగా జరుగుతున్నాయి. బడంగ్‌పేట్, మహేశ్వరం పాలిటెక్నిక్ కళాశాలలకు రూ.24 కోట్లు, డైట్ కాలేజీ ఏర్పాటుకు రూ.4 కోట్లు, రూ.4కోట్లతో జిల్లా గ్రంథాలయాలను ఇప్పటికే ప్రారంభించారు. మహేశ్వరం డిగ్రీ కళాశాలకు రూ.కోటి, మోడల్ స్కూల్‌కు రూ.4 కోట్లు మంజూరు చేయించారు. మన ఊరు-మన బడి కింద మొదటి విడతలో 26 ప్రాథమిక పాఠశాలలు, 10 ప్రాథమికోన్నత పాఠశాలలు, 18 ఉన్నత పాఠశాలలు, మొత్తం 54 ఎంపిక చేసి రూ.16 కోట్లతో 12 రకాల మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. మిగిలిన పాఠశాలలకు మరో రూ.9.13 కోట్లు మంజూరు చేయించి, ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దారు. ఇటీవల రాష్ట్రంలో 16 డిగ్రీ గురుకుల కళాశాలలు మంజూరు కాగా, వీటిలో మన జిల్లాకే రెండు (షాద్‌నగర్ బాలికల, కందుకూరు బాలుర గురుకులాలు) మంజూరయ్యాయి. కేసీతండా పరిధిలో రూ.కోటితో కొత్తగా నిర్మించిన డిగ్రీ కాలేజీ భవనాలను ఇటీవలే ప్రారంభించారు. రూ.1.29 లక్షలతో ఇదే చోట నిర్మించిన మోడల్ స్కూల్ బాలికల హాస్టల్ భవనాన్ని కూడా ఇటీవలే అందుబాటులోకి తీసుకొచ్చారు.

లంబో'ధర' లడ్డూ!

- ఈసారి గ్రేటర్ పరిధిలో 2 లక్షలకుపైగా విగ్రహాలు
- రూ.15 కోట్లకుపైనే పలికిన వేలం పాటలు
- ఏటా గణేశ్ లడ్డూకు పెరుగుతున్న డిమాండ్
- 1954లో ఖైరతాబాద్‌లో మొదలైన ఉత్సవాలు
- 1994 నుంచి బాలాపూర్‌లో లడ్డూ ప్రసాదం వేలం



సాక్షి, రంగారెడ్డి జిల్లా: భాగ్యనగరంలో గణేష్ ఉత్సవాలంటే ముందుగా గుర్తుకు వచ్చేది ఖైరతాబాద్ వినాయకుడు. ఆ తర్వాత బాలాపూర్ లడ్డూ వేలం పాట. 1954లో తొలిసారిగా ఒక్క అడుగుతో ఖైరతాబాద్ వినాయకుడిని ప్రతిష్ఠించారు. ఎత్తయిన గణేష్ విగ్రహం (63 అడుగులు) కూడా ఇదే. బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి తొలిసారిగా 1994లో లడ్డూ వేలం పాట ప్రారంభించింది. తొలి వేలం పాటలో రూ.450కి దక్కించుకున్నారు. ఈ లడ్డూను దక్కించుకున్న వారికి మంచి జరిగిందనే ప్రచారంతో ఆ తర్వాత ప్రసాదానికి మరింత డిమాండ్ పెరిగింది. 2002 నుంచి లక్షల్లో ధర పలకడం మొదలైంది. ఒకప్పుడు కేవలం బాలాపూర్‌నకు మాత్రమే పరిమితమైన ఈ లడ్డూ వేలం పాట ప్రస్తుతం ఇంతింతై అన్నట్లు గ్రేటర్ అంతా విస్తరించింది.

పోటాపోటీగా వేలం పాటలు..

- నిమజ్జనం సందర్భంగా నిర్వహించిన లడ్డూ వేలం పాటలు పోటాపోటీగా కొనసాగాయి. వినాయకుడి చేతిలో తొమ్మిది రోజుల పాటు పూజలు అందుకున్న ఈ లడ్డూ ప్రసాదాన్ని దక్కించుకునేందుకు భక్తులు పోటీపడ్డారు. గురువారం గ్రేటర్ జిల్లాల పరిధిలోని ప్రముఖ మండపాల్లో నిర్వహించిన వేలం పాటల్లో రూ.15 కోట్లకుపైగా ఉత్సవ కమిటీలకు సమకూరినట్లు తెలిసింది.
- ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలో రూ.5 కోట్లు, ఖైరతాబాద్‌లో రూ. 33.75 లక్షలు, సికింద్రాబాద్‌లో రూ.19 లక్షలు, శేరిలింగంపల్లిలో రూ.1.25 కోట్లు, అంబర్‌పేటలో రూ.25 లక్షలు, మల్కాజిగిరిలో రూ.48 లక్షలు, కుత్బుల్లాపూర్‌లో రూ.2.13 కోట్లు, చార్మినార్ ఏరియాలో రూ.56.88 లక్షలు, ఉప్పల్‌లో 1.50 కోట్లు, సనత్‌నగర్‌లో రూ.12 లక్షలు, గోషామహల్‌లో రూ.45 లక్షలు, మలక్‌పేటలో రూ.20 లక్షలు, మేడ్చల్‌లో రూ.1.50 కోట్లు, ముషీరాబాద్ నియోజకవర్గంలో రూ.20 లక్షల వరకు వేలం పాటలు కొనసాగాయి.
- కాగా.. బడంగ్‌పేట వీరాంజ నేయ భక్త సమాజం గణనాథుడి లడ్డూ కూడా రూ.17 లక్షలు.. చేవెళ్ల రచ్చబండ గణేషుడి చేతిలోని లడ్డూ ప్రసాదం రూ.22.11 లక్షలు, ఆదిబట్లలోని చైతన్య యూత్ అసోసియేషన్ వినాయకుడి లడ్డు రూ.12.50 లక్షలు, ఫరూక్‌నగర్ మండల పరిధిలోని మధురాపూర్ గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన గణనాథుని లడ్డు రూ.11.11 లక్షలు, కొంపల్లి అపర్ణ మెడల్స్‌లోని లడ్డూ ధర రూ.13 లక్షలు పలికింది.
- వేలం పాటలో దక్కించుకున్న లడ్డూ ప్రసాదాన్ని తినడం, కుటుంబ సభ్యులు, బంధువులకు పంపిణీ చేయడం, పంట పొలాల్లో చల్లడం ద్వారా మంచి జరుగుతుందనే నమ్మకం ఉంది. అంతేకాదు స్థానికంగా గుర్తింపుతో పాటు ప్రచార, ప్రసార మాధ్యమాల్లో విస్తృత ప్రచారం కూడా లభిస్తుండటంతో లడ్డూను దక్కించుకునేందుకు పోటీ పడుతున్నారు.

రూ.1.25 కోట్లు పలికి..

ఖైరతాబాద్ గణేషుడితో మొదలైన ఈ విగ్రహ ప్రతిష్ఠాపన సంస్కృతి.. క్రమంగా నగరమంతటా విస్తరించింది. ఈ ఏడాది గ్రేటర్‌లో చిన్నా పెద్దా కలిపి మొత్తం రెండు లక్షలకుపైగా విగ్రహాలు నెలకొల్పినట్లు అంచనా. రెండు మూడేళ్ల క్రితం వరకు బాలాపూర్ లడ్డూకు మాత్రమే రికార్డు స్థాయిలో ధర పలికేది. తాజాగా బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని సన్‌సిటీ రిచ్‌మండ్ విల్లాలోని గణనాథుడి లడ్డూ ప్రసాదం ఆ రికార్డును బద్దలు కొట్టింది. రూ.1.25 కోట్లు పలికి భక్తులందరినీ ఆశ్చర్యంలో ముంచేసింది. నిత్యం రికార్డుల్లో నిలిచే బాలాపూర్ లడ్డూ మాత్రం ఈసారి రూ.27 లక్షలు పలికింది.

ఎన్నికల బృందం రాక కోసం ఏర్పాట్లు



ఏర్పాట్లపై మాట్లాడుతున్న అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: అక్టోబర్ 3, 4, 5 తేదీల్లో రాష్ట్రానికి కేంద్ర ఎన్నికల బృందం రానున్న సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, జాయింట్ ఎన్నికల అధికారి సర్ఫరాజ్, కలెక్టర్ హరీశ్, సైబరాబాద్ పోలీసు కమిషనర్ స్టీఫెన్ రవీంద్రతో కలిసి మాదాపూర్‌ని టిక్ మహీంద్రాలో నిర్వహించే సమావేశాల ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం దుర్గం చెరువు కేబుల్ బ్రిడ్జిపైన అక్టోబర్ 4న ఉదయం 6 గంటలకు కేంద్ర ఎన్నికల బృందం సహకారంతో నిర్వహించే సైకిల్ ర్యాలీ ఏర్పాట్లను పరిశీలించారు.

నిమజ్జన సంబరాల్లో అపశ్రుతి

- ట్రాలీ చక్రాల కిందపడి బాలుడి దుర్మరణం
- చర్లపటేల్‌గూడలో విషాదం



సెహనాథ్ (ఫైల్)

ఇబ్రహీంపట్నం:వినాయక ఊరేగింపులో అందరితో కలిసి ఆడుతూ.. పాడుతూ.. హుషారుగా గడిపిన బాలుడు అకస్మాత్తుగా ట్రాక్టర్ ట్రాలీ చక్రాల కింద పడి మృతిచెందాడు. ఊహించని ఈ సంఘటనతో ఒక్కసారిగా విషాదం అలుముకుంది. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. చర్లపటేల్‌గూడకు చెందిన అంకిళ్ల రవి కుమారుడు సెహనాథ్ (14).. గ్రామంలో నిర్వహించిన నిమజ్జన వేడుకల్లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో అందరితో కలిసి పోచారం (కత్వా) వాగు వద్దకు వెళ్లాడు. గ్రామం దాటిన అనంతరం బాలుడు ఒక్కసారిగా అదుపుతప్పి ట్రాలీ నుంచి జారి కిందపడ్డాడు. వెనక చక్రాలు పైనుంచి వెళ్లడంతో అక్కడికక్కడే ప్రాణాలు వదిలాడు. సెహనాథ్ ఇబ్రహీంపట్నంలోని బ్రిలియంట్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మెట్రోకు పోటెత్తిన ప్రయాణికులు



సాక్షి, సిటీబ్యూరో: వినాయక నిమజ్జనం సందర్భంగా మెట్రో రైళ్లు పోటెత్తాయి. నిమజ్జన వేడుకలను సందర్శించేందుకు సుమారు లక్ష మంది ప్రయాణికులు ఖైరతాబాద్, లక్డీకాపూల్ స్టేషన్ల నుంచి రాకపోకలు సాగించినట్లు శుక్రవారం హైదరాబాద్ మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. గురువారం ఒక్క రోజే ఈ రెండు స్టేషన్లకు 46,834 మంది ప్రవేశించగా, 50,713 మంది వివిధ ప్రాంతాలకు బయలుదేరి వెళ్లారు. నిమజ్జన వేడుకలను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం తెల్లవారుజామున 2 గంటల వరకు మెట్రో సర్వీసులను అందుబాటులో ఉంచిన సంగతి తెలిసిందే. అదనపు సరీ్వసులను నడిపేందుకు కూడా అధికారులు ఏర్పాట్లు చేశారు. మరోవైపు ఖైరతాబాద్ మహాగణపతిని సందర్శించేందుకు వారం, పది రోజుల పాటు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రోజుకు 30 వేల మందికి పైగా ఖైరతాబాద్ నుంచి రాకపోకలు సాగించారు. చివరి రోజు గురువారం కూడా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు.

'చెక్ యువర్ ఓట్'కు విశేష స్పందన

సాక్షి, సిటీబ్యూరో: 'చెక్ యువర్ ఓట్' గురించి జీహెచ్ఎంసీ చేపట్టిన ప్రచారానికి విశేష స్పందన లభించిందని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ పేర్కొన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా మసీదుల వద్ద, గణేశ్ నిమజ్జనం సందర్భంగా ట్యాంక్‌బండ్‌తో పాటు వివిధ చెరువుల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమం ప్రజల్లో మంచి అవగాహన కల్పించిందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఓటరు జాబితాకు సంబంధించిన సమాచారం కోసం 1950 హెల్ప్ లైన్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.



నిమజ్జనమైన విగ్రహాలు 91,154

జోన్	28వ తేదీ	29వ తేదీ	మొత్తం
ఎల్బీనగర్	9,381	1071	10,452
చార్మినార్	2,625	0	2,625
ఖైరతాబాద్	9,494	12,299	21,793
శేరిలింగంపల్లి	21,043	5,159	26,202
కూకట్‌పల్లి	18,941	29	18,970
సికింద్రాబాద్	4,531	6,581	11,112
మొత్తం	66,015	25,139	91,154

సాక్షి, సిటీబ్యూరో: ఈ ఏడాది గ్రేటర్‌లో వివిధ ప్రాంతాల్లో దాదాపు 91,154 గణేశ్ విగ్రహాలు నిమజ్జనమైనట్లు జీహెచ్ఎంసీ ఒక ప్రకటనలో పేర్కొంది. శుక్రవారం సాయంత్రం వరకు 91,154 విగ్రహాలు నిమజ్జనాలైనట్లు తెలిపింది. వినాయకచవితి ప్రారంభమైనప్పటి నుంచి 28వ తేదీ వరకు, 29వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు నిమజ్జనాలైన విగ్రహాల సంఖ్య జోన్ల వారీగా..



33 వేల టన్నుల వ్యర్థాలు

మరోవైపు నిమజ్జన వ్యర్థాల తరలింపు ప్రక్రియ మొదలైంది. శుక్రవారం నాటికి పీపుల్స్‌ప్లాజా, నెక్లెస్ రోడ్డు వైపు 33వేల టన్నుల వ్యర్థాలను తొలగించినట్లు హెచ్ఎండీఏ అధికారులు తెలిపారు. విగ్రహాల నిమజ్జనం కొనసాగుతున్న దృష్ట్యా తొలగింపు ప్రక్రియ నెమ్మదిగా సాగుతోందని శని, ఆదివారాల్లోనూ వ్యర్థాలను తొలగించనున్నట్లు పేర్కొన్నారు. మరో 15 వేల టన్నులకు పైగా వ్యర్థాలు ఉండవచ్చని అంచనా వేస్తున్నారు.

రెండో రోజూ..

బైబై గణేశా

- కొనసాగిన నిమజ్జనాలు
- రహదారులపై బారులు తీరిన విగ్రహాలు
- 10 వేలకుపైగా భారీ విగ్రహాల నిమజ్జనం
- వేలాది సంఖ్యలో చిన్న ప్రతిమలు
- నిమజ్జన వాహనాలతో స్తంభించిన ట్రాఫిక్
- వ్యర్థాల తొలగింపును చేపట్టిన హెచ్ఎండీఏ



సాక్షి, సిటీబ్యూరో: వినాయక విగ్రహాల నిమజ్జనం శుక్రవారం రెండో రోజూ కొనసాగింది. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో విగ్రహాలు తరలివచ్చాయి. దీంతో ట్యాంక్‌బండ్, నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా వైపు నిమజ్జన వాహనాలు భారీ ఎత్తున బారులు తీరాయి. గురువారం మొదలైన వినాయక విగ్రహాల నిమజ్జన వేడుకలు నిరాటంకంగా శుక్రవారం కూడా కొనసాగగడంతో పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి.

- రామంతాపూర్, అంబర్‌పేట్, మలక్‌పేట్, దిల్‌సుఖ్‌నగర్, పాతబస్తీలోని పలు ప్రాంతాల నుంచి విగ్రహాలు తరలివచ్చాయి. రెండు రోజులుగా సుమారు 10 వేలకుపైగా భారీ విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు పోలీసు వర్గాలు అంచనా వేశాయి. మరోవైపు 5 అడుగుల కంటే తక్కువ ఎత్తు కలిగిన విగ్రహాలు సుమారు 30 వేలకుపైగా నిమజ్జనం చేసినట్లు తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ఆరంభమైన మూడో రోజు నుంచే నిమజ్జన వేడుకలు మొదలయ్యాయి. 5వ రోజు కూడా భారీ సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేశారు. ఉత్సవాల అనంతరం గురువారం పెద్ద ఎత్తున విగ్రహాలను నిమజ్జనం చేయగా, శుక్రవారం కూడా అన్ని వైపులా నుంచి విగ్రహాలు తరలి వచ్చాయి. శుక్రవారం రాత్రి వరకూ నెక్లెస్‌రోడ్డు, పీపుల్స్‌ప్లాజా వైపు విగ్రహాల నిమజ్జనం కొనసాగింది.

మహాగణపతి నిమజ్జనంతో మొదలు..

ఖైరతాబాద్ మహాగణపతి విగ్రహాన్ని నిమజ్జనం చేసిన తర్వాత మిగతా విగ్రహాల తరలింపు క్రమంగా పెరిగింది. గురువారం సాయంత్రం వరకు మందకొడిగా సాగిన తరలింపు ప్రక్రియ రాత్రి నుంచి వేగంగా సాగింది. బాలాపూర్ విగ్రహాన్ని తరలించిన అనంతరం వరుసగా పాతబస్తీలోని వివిధ ప్రాంతాలకు చెందిన విగ్రహాలు బారులు తీరాయి.భారీ విగ్రహాలు కావడంతో నెమ్మదిగా ముందుకు కదిలాయి. అదే సమయంలో రామంతాపూర్, అంబర్‌పేట్ వైపు నుంచి, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వాహనాలు కూడా ప్రధాన శోభాయాత్రలో చేరడంతో నిమజ్జనం నెమ్మదిగా సాగింది. కొన్నిచోట్ల అర్ధరాత్రి తర్వాత నిమజ్జన ఏర్పాట్లు చేయగా, కొన్ని విగ్రహాలను శుక్రవారం ఉదయం తరలించారు. దీంతో గురువారం మొదలైన నిమజ్జన శోభాయాత్ర నిరాటంకంగా సాగింది. అబిడ్స్, కోఠి, బషీర్‌బాగ్, లిబర్టీ, హిమాయత్‌నగర్ తదితర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు స్తంభించాయి. సిటీబస్సులు, ఇతర వాహనాలు స్తంభించడంతో నగరవాసులు ఇబ్బందులకు గురయ్యారు. సాధారణంగా ప్రతి సంవత్సరం మొదటి రోజే ఎక్కువ సంఖ్యలో విగ్రహాలు నిమజ్జనం అవుతాయి. రెండో రోజు మిగిలిన విగ్రహాలను ఉదయం పదింటి వరకే పూర్తి చేస్తారు.కానీ అందుకు పూర్తిగా భిన్నంగా రెండు రోజులు నిమజ్జనం కొనసాగింది. శుక్రవారం రాత్రి కూడా విగ్రహాలను నిమజ్జనం చేశారు.

సర్వేను అడ్డుకున్న కౌలు రైతులు



అధికారులతో మాట్లాడుతున్న కౌలు రైతులు

- ఏళ్లుగా సాగులో ఉన్నాం
- పట్టాలు ఇవ్వాలని మొర

యాచారం: నందివనపర్తి ఓంకారేశ్వరాలయ భూముల సర్వేను కౌలు రైతులు శుక్రవారం అడ్డుకున్నారు. ఓంకారేశ్వరాలయానికి నస్దిక్‌సింగారం, నందివనపర్తి, తాడిపర్తి, కుర్మిద్ద గ్రామాల్లో 1,400 ఎకరాలకు పైగా భూమి ఉంది. ఏళ్లుగా ఆయా గ్రామాలకు చెందిన కౌలు రైతులు ఆ భూముల్లో సాగుకు యోగ్యంగా మార్చుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఈ క్రమంలో కౌలు రైతులు సాగులో ఉండగానే చాల ఎకరాల భూమి అక్రమార్కులు కాజేశారని వారు పేర్కొన్నారు. వెంటనే మొత్తం భూమిని సర్వే చేసి హద్దులు గుర్తించాలని మాజీ ఆలయ ధర్మకర్త పప్పు కృష్ణమూర్తి ఏడాది కిందటే రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ, రెవెన్యూ శాఖల అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఆలయ ధర్మకర్త ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి ఆదేశాల మేరకు శుక్రవారం దేవాదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ శేఖర్, ఈఓలు ప్రవీణ్‌కుమార్, ప్రణీత్‌కుమార్‌లు నస్దిక్‌సింగారం గ్రామంలోని ఆలయ భూమిని సర్వే చేస్తున్నారు.

సమాచారం లేకుండా ఎలా సర్వే చేస్తారు..

ఓంకారేశ్వరాలయ భూమి విషయంలో కౌలు రైతులకు సమాచారం లేకుండా ఎలా సర్వే చేస్తారని తాడిపర్తి సర్పంచ్ దూస రమేశ్ ఆధ్వర్యంలో కౌలు రైతులు ఆలయ భూమి సర్వేను అడ్డుకున్నారు. అధికారులపై వారు మండిపడ్డారు. ఏళ్లుగా తాము సాగులో ఉన్నామని అధికారులతో చెప్పారు. రూ. లక్షలాదిగా అప్పులు చేసి బోర్లు వేసుకొని సాగుకు యోగ్యంగా మార్చుకున్నామని కౌలు రైతులు అధికారులతో విన్నవించుకున్నారు. తమకు కనీసం సమాచారం ఇవ్వకుండా ఎలా సర్వే చేస్తారని వారు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కొద్దిసేపు అధికారులు, కౌలు రైతుల మధ్యన వాగ్వాదాం, మాటల యుద్ధం నడిచింది, సర్వే చేసి హద్దులు పెడుతామని అధికారులు అనడం, అసలు సర్వే చేయరాదని కౌలు రైతులు వాపోయారు. తమకు పట్టాదారు, పాసుపుస్తకాలు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని ఇబ్రహీంపట్నం ఆర్డీఓ అనంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. భూములు లాక్కోవడం లేదు, సర్వే చేసి హద్దులు గుర్తిస్తామని ఆర్డీఓ హామీ ఇచ్చిన కూడా కౌలు రైతులు ససేమిరా అన్నారు. దీంతో శనివారం కౌలు రైతులు ఆర్డీఓ కార్యాలయానికి రావాలని ఆర్డీఓ అనంత్‌రెడ్డి కౌలు రైతులతో పేర్కొన్నారు. అధికారులు సర్వే నిలిపేయడంతో ఉద్రిక్తతగా మారిన పరిస్థితి సద్దుమణిగింది.

బెల్టు దుకాణాలపై దాడులు

- రెండు కాటన్ల బీర్లు, 76 మద్యం బాటిళ్లు స్వాధీనం
- ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

యాచారం: నందివనపర్తి గ్రామంలో పలు బెల్టు దుకాణాలపై శుక్రవారం ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న బాలకృష్ణ ఇంట్లో నుంచి రెండు కాటన్ల బీర్లు, 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం బాలకృష్ణను అదుపులోకి తీసుకుని యాచారం పోలీసులకు అప్పగించారు. యాచారం సీఐ సైదయ్య ఆధ్వర్యంలో గురువారం రాత్రి మొండిగౌరెల్లి గ్రామంలో, గ్రీన్ ఫార్మాసిటీ పోలీస్ స్టేషన్ సీఐ రామాంజనేయులు ఆధ్వర్యంలో నానక్‌నగర్ గ్రామంలోని బెల్టు దుకాణాలపై దాడులు నిర్వహించారు. అక్రమంగా నిల్వ ఉన్న మద్యాన్ని స్వాధీనం చేసుకుని వ్యాపారులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయా పోలీస్ స్టేషన్ల సీఐలు సైదయ్య, రామాంజనేయులు తెలిపారు.



ఎస్ఓటీ అధికారలకు పట్టుబడ్డ మద్యం బాటిళ్లు

అన్నదాతల సంక్షేమానికి కృషి

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



గోదాంలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అన్నదాతల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ అన్నారు. ఎలికట్ట గ్రామ శివారులో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వెయ్యి మెట్రిక్ టన్ను సామర్థ్యంతో నిర్మించిన రెండు గోదాంలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రత్యేక తెలంగాణ ఏర్పాటయితే రైతులు ఆగం అవుతారని, వ్యవసాయ రంగం పూర్తిగా కుంటుబడుతుందని చాలా మంది నాయకులు అన్నారనే విషయాన్ని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం గణనీయమైన పురోభివృద్ధి సాధించిందన్నారు. రైతును రాజు చేయాలనే లక్ష్యంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని అన్నారు. ఎక్కడ చూసిన పచ్చని పంట పొలాలు కనిపిస్తున్నాయని, ధాన్యం ఉత్పత్తికి తెలంగాణ కేంద్ర బిందువుగా మారిందన్నారు. రైతులు పండించిన పంటలకు సరైన గిట్టుబాటు ధర కల్పించడంతో పాటుగా, వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్, రైతు బీమా, రైతు బంధు వంటి అనేక పథకాలను ప్రభుత్వం విజయవంతంగా అమలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సహకార సంఘం చైర్మన్ రాజావరప్రసాద్, పీఏసీఎస్ చైర్మన్ బక్కన్న యాదవ్, ఎంపీపీ ఖాజా ఇద్రీస్, వంకాయల నారాయణరెడ్డి, సాయి ప్రసాద్ యాదవ్, చేగూరి రాఘవేందర్, కావలి శ్రీశైలం, బాబు నాయక్, పాండురంగారెడ్డి పాల్గొన్నారు

కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేత..

పట్టణంలోని కింగ్ ప్యాలెస్ మండల పరిధిలోని వెలిజర్ల గ్రామానికి చెందిన 15 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ వాడ్యాల లావణ్య, అశోక్ రెడ్డి, తాండ్ర వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, అనిమి గణేశ్, జాంగారి రవి, విష్ణు, రాందాస్, నర్సింలు, సునీల్‌రెడ్డి, హబీబ్, తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి పెద్దపీట

రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి

మహేశ్వరం: మైనార్టీల అభివృద్ధికి, సంక్షేమానికి బీఆర్ఎస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి సబితారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మన్సాన్‌పల్లిలో మైనార్టీ భవన్‌కు స్థలం కేటాయించినందుకు మంత్రికి ముస్లింలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లిం నిరుద్యోగ యువతకు సబ్సిడీ రుణాలు అందించి వారి ఆర్థికాభివృద్ధికి కృషి చేస్తుందని తెలిపారు. మండల కేంద్రంలో ముస్లిం కమ్యూనిటీ హాల్, ఈద్గా, దర్గా, మసీదుల నిర్మాణానికి నిధులు తీసుకొచ్చామన్నారు. దళితులు, గిరిజనులు, బీసీల్లోని అన్ని కులాలకు భవన నిర్మాణాలకు స్థలాలు కేటాయించి రూ.10 నుంచి కోటి రూపాయాల వరకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ సమీర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అంగోత్ రాజు నాయక్, ఎంఏ ఫరీద్, అజామ్, హాజీబాబ, దావూద్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ రూ.3.5 కోట్లు

- దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు మంజూరు చేస్తాం
- ఉప్పరిగూడ పీఏసీఏస్ చైర్మన్ సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం: 684 మంది రైతులకు రూ. 3.5 కోట్ల రుణామాఫీ చేశారని పీఏసీఎస్ చైర్మన్ టీకుల సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఉప్పరిగూడ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలక వర్గ సర్వసభ్య సమావేశం శుక్రవారం శేరిగూడలోని కార్యాలయ భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ 929 మంది అర్హుల్లో 684 మంది రైతులకు రుణామాఫీ చేశారన్నారు. మిగతా 245 మంది రైతులకు త్వరలో చేయనున్నట్లు చెప్పారు. రూ. 2కోట్ల దీర్ఘకాలిక రుణాలను ఇచ్చేందుకు బ్యాంకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రైతులు పండించిన పంటను నిల్వచేసుకునేందుకు ఇటీవల ప్రారంభించిన 2,500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం గల గోడౌన్ సిద్ధంగా ఉందన్నారు. అందులో నిల్వ చేసి న పంట ధాన్యం విలువను బట్టి 80 శాతం రుణా న్ని రైతులకు అందజేస్తారని సుదర్శన్‌రెడ్డి చెప్పారు. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ క్యామ శంకర్, సీఈఓ గణేశ్, పాలకవర్గ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కేసులు

ఏఎస్ఐ సీతారాంరెడ్డి

తలకొండపల్లి: అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తే సంబంధిత వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఏఎస్ఐ సీతారాంరెడ్డి హెచ్చరించారు. మండల పరిధిలోని పడకల్ శివారు ప్రాంతంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్నారనే పక్కా సమాచారం మేరకు పోలీసులు నిఘా పెట్టి కాపు కాశారు. ఇసుకను ట్రాక్టర్‌లో నింపుతున్న జేసీబీని, ట్రాక్టర్లను శుక్రవారం సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

క్రీడలతో ఆరోగ్యం

ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: క్రీడలతో శారీరక మానసిక ఆరోగ్యం పెంపొందునని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. జిల్లా విద్యాశాఖ ఆదేశాల మేరకు 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో వాలీబాల్ అండర్–14, 17 బాల బాలికలకు కడ్తాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులకు డ్రెస్ కోడ్ ఇవ్వాలని పీఈటీలు ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ను కోరారు. ఈ విషయంలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ తక్షణమే స్పందించి క్రీడాకారులకు చేయూతనందిస్తామని హామీఇచ్చారు. అనంతరం డ్రెస్ కోడ్ నిమిత్తం రూ.50 వేలను పీఈటీ సుశీలకు శుక్రవారం ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీపీ సీఎల్ శ్రీనివాసుయాదవ్, మార్కెట్ చైర్మన్ నాలాపురం శ్రీనివాసురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా 'ఔటర్' సర్వీస్ రోడ్డు



ఇసుక రేణువులతో నిండిన తుక్కుగూడ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డు


తుక్కుగూడ: మున్సిపాలిటీ పరిధిలోని నెహ్రు ఔటర్ రింగు రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఈ రోడ్డులో రాత్రింబవళ్లు విరామం లేకుండా మట్టి లారీలు పోవడంతో దాని నుంచి వెలువడుతున్న దుమ్ము, ధూళిరోడ్డుపై పడుతుంది. దీంతో రోడ్డంతా ఇసుక రేణువులు నిండిపోతుంది. ఇక్కడి నుంచి ప్రయాణం చేసే వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నాయి. ఓఆర్ఆర్ నిర్వహకులు స్పందించి సర్వీస్ రోడ్డును శుభ్రంగా ఉంచాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫిజిక్స్‌లో స్వాతికి డాక్టరేట్



మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా పని చేస్తున్న దాసరి స్వాతి డాక్టరేట్ అందుకున్నారు. మండల పరిధిలోని తోల్‌కట్ట సమీపంలోని ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ వికారాబాద్ మహిళా డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ లెక్చరర్‌గా ఆమె పని చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఛత్తీస్‌ఘడ్‌లోని ఐఎస్‌బీఎం యూనివర్సిటీ నోటిఫికేషన్ జారీ చేయడంతో తన బోధనానుభవంతో, బోధన పటిమతో విద్యార్థుల, అధికారుల మన్ననలు పొందారు. ఎంతో మంది విద్యార్థులకు ప్రతిష్టాత్మక యూనివర్సిటీల్లో పీజీలో ప్రవేశం పొందడానికి తను కోచింగ్ ఇచ్చారన్నారు. డాక్టర్ ఎస్ కుమారస్వామి పర్యవేక్షణలో 'ఎక్స్ ఫ్లోరింగ్ మల్టీ ఫంక్షనల్ ప్రాపర్టీస్ ఆఫ్ మ్యాగ్నెటిక్ బెస్ట్ మల్టీ ఎరాయిక్స్ ఇన్ సైడ్స్ ఫ్రమ్ స్ట్రక్చర్‌లో స్పెక్ట్రోస్కోపిక్ పై ఎలక్ట్రిక్ అండ్ మ్యాగ్నటిక్స్ ప్రాపర్టీస్' అనే అంశంపై ఛతీస్‌ఘడ్‌లో ఐఎస్‌బీఎం యూనివర్సిటీలో సిద్ధాంత గ్రంథం సమర్పించి పీహెచ్‌డీ పట్టా పొందారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్‌శర్మ అభినందించారు.

విగ్రహ ఆవిష్కరణకు మంత్రికి ఆహ్వానం



సాయన్న విగ్రహ ఆవిష్కరణకు రావాలని ఆహ్వానిస్తున్న ముదిరాజ్‌సంఘం నాయకులు

చేవెళ్ల: అక్టోబర్ 5వ తేదీన చేవెళ్ల మండలకేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన పండుగల సాయన్న విగ్రహ ఆవిష్కరణకు రావాలని మంత్రి మహేందర్‌రెడ్డిని ముదిరాజ్ సంఘం నాయకులు కోరారు. శుక్రవారం మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి నివాసంలో చేవెళ్ల నియోజకవర్గానికి చెందిన ముదిరాజ్‌సంఘం నాయకులు కలిసి ఆహ్వానం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాబిన్ ఉడ్‌గా పేరుగాంచి పండుగల సాయన్న విగ్రహాన్ని చేవెళ్ల మండల కేంద్రంలో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి పట్నం మహేందర్‌రెడ్డి హాజరు కావాలని వారు కోరారు. కార్యనిర్వాహక కమిటీ సభ్యులు ఊరడి నర్సింలు, గోపాల్, మాసయ్య, లింగం, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల అభివృద్ధే ధ్యేయం

- మహాసభ జిల్లా ప్రధాన కార్యదర్శి గందె సురేశ్
- నేడు ఇందిరాపార్కు వద్ద దీక్ష



మాట్లాడుతున్న గందె సురేశ్

షాద్‌నగర్‌రూరల్: ఆర్యవైశ్యుల అభివృద్ధే ధ్యేయమని సంఘం మహాసభ జిల్లా ప్రధానకార్యదర్శి గందె సురేశ్ పేర్కొన్నారు. కార్పొరేషన్ సాధనకు ఇందిరాపార్కు వద్ద శనివారం చేపట్టనున్న దీక్షను విజయవంతం చేయాలని గందె సురేశ్ అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యులలో ఎంతో మంది పేదలు ఉన్నారని, అలాంటి వారిని ఆదుకునేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్థికంగా వెనుకబడిన ఆర్యవైశ్యులకోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ దీక్షకు ఆర్యవైశ్యులు, అనుబంధ సంఘాల నాయకులు, సభ్యులు అధిక సంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుడిపల్లి వెంకటరమణ, సంఘం పట్టణ మాజీ అధ్యక్షుడు ఎంసానిశ్రీనివాస్, పట్టణ యుజన సంఘం ఉపాధ్యక్షుడు దండునవీన్, ఉప్పలశ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకుంటాం



నివాళి అర్పిస్తున్న అవినాశ్‌రెడ్డి

షాబాద్: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సురేందర్‌రెడ్డి కుటుంబాన్ని ఆదుకుంటామని షాబాద్ జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అంతారం గ్రామానికి చెందిన ఈగ సురేందర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబాన్ని అవినాశ్‌రెడ్డి పరామర్శించి ఓదార్చారు. సురేందర్‌రెడ్డి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ యాదమ్మ జంగయ్య, మండల రైతు సమన్వయ సమితి కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, శ్రీరాంరెడ్డి, నర్సింహారెడ్డి, కరుణాకర్, సుధాకర్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.